క్లుప్తంగా

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

బొబ్బిలి: వలంటీర్లకు ఇస్తామన్న రూ.10 వేల వేతనం హామీ తక్షణమే అమలుచేయాలని కోరుతూ పలువురు వలంటీర్లు, వలంటీర్ల సంఘ నాయకులంతా కలిసి ఎమ్మెల్యే బేబీనాయన, జనసేన పార్టీ నాయకుడు పాలూరి బాబుకు వినతిపత్రాలు గురువారం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులై, సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు గత మూడు నెలలుగా వేతనాలు నిలిపివేశారని వాపోయారు. కనీసం రాజీనామా చేయని వలంటీర్లకు కూడా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగించి, రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొబ్బిలిరూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం పురస్కరించుకుని, మండలంలోని ముత్తాయవలస గ్రామ దుర్గాదేవి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం గురువారం చేపట్టారు. గ్రామానికి చెందిన భవానీ భక్తుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై, అన్నప్రసాదం స్వీకరించారు. వేడుకలు జరిగే తొమ్మిది రోజులూ అన్నదాన కార్యక్రమం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

రాజాం: శాఖా గ్రంథాలయానికి విజయనగరానికి చెందిన ధీర ఫౌండేషన్ వారు పలు పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ చేశారు. ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ వాటిని పి.శ్రీనివాసరావు చేతులమీదుగా గ్రంథాలయానికి గురువారం అందజేశారు. అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్ గ్రేడ్-3, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, ఆర్‌పీఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్, జూనియర్ ఇంజినీర్ డీఎం, నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ-సి గ్రాడ్యుయేట్, నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షలకు నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలు అందించినట్లు గ్రంథాలయాధికారి వై. అమర్నాథ్ తెలిపారు. ధీర ఫౌండేషన్‌కు, ఫౌండేషన్ అధినేత సందీప్‌కు పాఠకులు, లైబ్రేరియన్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

రేగిడి: శాఖా గ్రంథాలయానికి విజయనగరానికి చెందిన ధీర ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ తమ సంస్థ తరఫున పలు పోటీ పరీక్షల పుస్తకాలను గురువారం వితరణ చేశారు. నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా వీటిని అందించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, వాసుదేవరావులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు లైబ్రేరియన్ పి.ఈశ్వరరావు కృతజ్ఞతలు చెప్పారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వారానికి ఒక మండలంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని తెలిపారు. ప్రజలంతా తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నందబలగ గ్రామానికి చెందిన కొనపాల సంతోష్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా, సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.43,690లను ఎమ్మెల్యే ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నర్సుపల్లి వెంకటేశ్వరరావు, ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎస్.వెంకటనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎస్‌ఐ సాగర్‌బాబు, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి దర్శనానికి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ముర్రాటలు సమర్పించడంతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో రోజుకో అవతారంలో దర్శనమిచ్చే అమ్మవారిని కొలిచేందుకు భక్తులు ఉత్సుకత కనబరుస్తున్నారు. పలుచోట్ల భవానీ భక్తులు మాలాధారణ చేయగా, ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

–బొబ్బిలి, రాజాం



బొబ్బిలిరూరల్: అలజంగిలో పూజలందుకున్న దుర్గమ్మ



రాజాం: గాంధీనగర్‌లో ముర్రాటలతో దుర్గాదేవి మండపానికి వెళ్తున్న మహిళలు



రాజాం: గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: మండల కేంద్రంలోని సిరిపురపు వీధిలో కొలువుదీరిన దుర్గమ్మ



రామభద్రపురం: మండపానికి తరలిస్తున్న దుర్గాదేవి అమ్మవారి విగ్రహం



బాడంగి: మండల కేంద్రంలోని యాదవ వీధిలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



తెర్లాం: పెరుమాళిలో దుర్గాదేవి పూజలు



రాజాం సిటీ: కంచరాంలో దుర్గాదేవి విగ్రహ ఊరేగింపులో కలశాలతో మహిళలు



వంగర: రుషింగిలో పూజలు చేస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది రాజగోపాలరావు, తదితరులు



బొబ్బిలి: తారకరామా కాలనీలో దుర్గతల్లికి భక్తుల పూజలు



రాజాం సిటీ: బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు శ్రీనివాసశర్మ



బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరాలయంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



బొబ్బిలిరూరల్: దిబ్బగుడ్డివలసలో భవానీమాతకు భక్తుల పూజలు

బాధ్యతల స్వీకరణ



సంతకవిటి: ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి, స్వాగతం పలుకుతున్న సిబ్బంది

సంతకవిటి: ఎంపీడీవోగా కె.సురేష్‌కుమార్ మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన జి.వి.రవికుమార్ పోలాకి బదిలీ కాగా, లావేరు మండలం నుంచి సురేష్‌కుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.



తెర్లాం: ఎంపీడీవో రాంబాబును కలిసిన అధికారులు

తెర్లాం: ఎంపీడీవోగా రేగి రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శంబంగి రామకృష్ణ బాడంగి ఎంపీడీవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి ఎంపీడీవోగా పనిచేస్తున్న రాంబాబు ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులంతా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.



బాడంగి: బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఎంపీడీవోగా శంబంగి రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఆంజనేయులు విశాఖపట్నం జిల్లాలోని చోడవరం మండలానికి బదిలీ కాగా తెర్లాం ఎంపీడీవోగా పనిచేసిన రామకృష్ణ ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు.



బొబ్బిలి: బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: ఆర్డీవోగా వీఎస్ఎస్ రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండుదొరలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు విలేకరులతో గురువారం మాట్లాడారు. కొమరాడ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) తొమ్మిదో తరగతి విద్యార్థిని శారద, గుమ్మలక్ష్మీపురం మండలం, పి.ఆమిటి ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని అవంతిలు చికిత్స పొందుతూ మరణించారని, వారి మరణాలకు గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఏటా గిరిజన పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థుల చదువు, ఆరోగ్యానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు అప్పన్న, ఎండుదొర

రైతులు అప్రమత్తంగా ఉండాలి



సంతకవిటి: చిత్తారపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో నవీన్



వంగర: కొప్పరవలసలో వరి పంట పరిశీలనలో అధికారులు

రేగిడి: పంటలకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరాలవలస, జాడపేట, లచ్చారాయపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు సుడిదోమ, పేనుబంక తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున ప్రతిరోజూ పంటను పరిశీలించి, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి, అలజంగి గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్ పాల్గొని, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పంటల సాగు విధానాలు, రక్షణ చర్యలు, విక్రయాలకు సంబంధించి, అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంతకవిటి: మండలంలోని హొంజరాం, చిత్తారపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమంలో ఏవో పైల నవీన్ పాల్గొని, రైతులకు నూతన వ్యవసాయ విధానాలు అవలంబించాలని తెలిపారు. అనంతరం క్షేత్ర పర్యటనకు వెళ్లి, వరి పంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ జి.విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని మద్దివలస, కొప్పరవలస గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో తట్టికోట కన్నబాబు పాల్గొని, పంటల సాగు, పురుగుమందు నియంత్రణ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మరువాడ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని నారసింహునిపేట దాని పరిసర ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మక్కువ ఫీడర్ వద్ద మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సంతకవిటి: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వంగర: మండలంలోని కొప్పరవలసలో శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అలజింగి సంగమేషుతో పాటు గ్రామానికి చెందిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

సెల్‌టవర్ వద్దు



సెల్‌టవర్ ఏర్పాటు ప్రదేశం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని కొండంపేటకు వెళ్లే దారిలో బీఎస్ఎన్ టవర్ ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. కొండంపేట వాసులతో పాటు సమీపంలోని శాంతినగర్, మాదిగ వీధి ప్రజలంతా ఆ ప్రదేశానికి గురువారం చేరుకుని, ఆందోళన చేపట్టారు. తక్షణమే సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని డిమాండ్ చేశారు. జనావాసాల్లో టవర్ ఏర్పాటు జరిగితే రేడియేషన్‌కు గురై, ప్రజలు కేన్సర్ బారినపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసానికి దూరంగా గ్రామ శివారులో టవర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.మనోజ్‌కుమార్, పి.రాజేశ్వరరావు, జి.రాజశేఖర్, పి.శ్రీనివాసరావు, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేయూజీఏకు నిమ్మలపాడు ఎంపిక

బొబ్బిలిరూరల్: దేశ వ్యాప్తంగా గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేయూజీఏ(ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్) పథకానికి మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీలోని నిమ్మలపాడు గ్రామం ఎంపికైంది. ఇప్పటికే ఈ పథకానికి రాచేరువలస గ్రామం ఎంపిక కాగా, ఆ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పించేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా పీఎంజేయూజీఏ కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తొమ్మిది గ్రామాలను ఎంపిక చేయగా, వాటిలో సీహెచ్ బొడ్డవలస పంచాయతీకి చెందిన రెండు గ్రామాలు ఎంపిక కావడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లు తేలిన రోడ్డు



రాళ్లు తేలిన రోడ్డులో విద్యార్థినుల సైకిల్ ప్రయాణం

సంతకవిటి: మండలంలోని మందరాడ, ముకుందాపురం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయమై, ఎక్కడపడితే అక్కడ రాళ్లు తేలిపోయి ఉండడంతో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రయాణీకులు వాపోతున్నారు. ముఖ్యంగా మోదుగులపేట, ముకుందపురం, గోవిందపురం, నారాయణరాజపురం విద్యార్థులు మందరాడ పాఠశాలకు వెళ్లేందుకు ఇదే రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉండడంతో వారు ఎప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతారోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, కనీసం రోడ్డు మరమ్మతు పనులైనా చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామసభల్లో 'ఉపాధి' పనుల గుర్తింపు



రేగిడి: గుళ్లపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో హరనాథరావు

రాజాం/తెర్లాం/రేగిడి/బాడంగి: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామసభలు గురువారం నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి పనుల గుర్తింపు నిమిత్తం చేపట్టిన ఈ సమావేశాల్లో రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని, పని ప్రదేశాల గుర్తింపుపై ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు చర్చించారు. పనుల గుర్తింపులో నిర్లక్ష్యం వద్దని, వేతనదారులు, రైతులు కోరిన చోట పనులు జరిగేలా చూడాలని అధికారులు సిబ్బందికి సూచించారు. అనంతరం పనుల ప్రతిపాదనలకు తీర్మానం చేశారు.

సమస్యల పరిష్కారానికి 'గ్రామ సందర్శన' దోహదం



సంతకవిటి: జావాం అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు



రామభద్రపురం: కొత్తరేగలో చెత్త సంపద తయారీ కేంద్రం సందర్శనలో ఎంపీడీవో రమామణి



రేగిడి: అంబకండి అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రాజాం/రేగిడి/సంతకవిటి/రామభద్రపురం: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐసీడీఎస్ పీవోలంతా కలిసి గ్రామాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశు వైద్యశాలలు, సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, వసతులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తుల సమస్యలపై వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ఈ గ్రామ సందర్శన కార్యక్రమం దోహదం చేస్తుందని, ప్రతిఒక్కరూ తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.

పరామర్శ



లక్ష్మణరావును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన నల్లా లక్ష్మణరావును వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం కలిసి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మణరావు గాయాలపాలై, పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్.. ఉదయం ఆయన వద్దకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఒమ్మి గ్రామ పార్టీ నాయకులు వంగా శ్రీనివాసరావు, వంగా రమేష్, కోండ్రు చిన్నప్పడు, గెడ్డాపు అప్పలనాయుడు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.